

# పరిశుద్ధ గ్రంథమును అధ్యయనము చేసే పాఠ్యాంశములు

*“యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొందము రండి; యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించుకొనుటకు ఆయనను అనుసరించుదము రండి. ఉదయము తప్పక వచ్చురీతిని ఆయన ఉదయించును; వర్షమువలె ఆయన మనయొద్దకు వచ్చును; భూమిని తడుపునట్టి తొలకరి వర్షము కడవరి వర్షమువలె ఆయన మనయొద్దకు వచ్చును.” హోషేయ 6:3*

**అపొస్తలుడైన పౌలు వ్రాసిన పత్రికలు (PAUL’S LETTERS)**

ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక మరియు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక

**(EPHESIANS AND PHILIPPIANS)**

# పరిశుద్ధ గ్రంధమును బోధించుటను గూర్చిన మూలసూత్రములు

## ఉద్దేశ్యము

హాజరయిన ప్రతి వ్యక్తి దేవుని వాక్యము నందు క్రమమైన, ఖచ్చితమైన సమయమును వెచ్చించి, ప్రతి వారము దేవునిని తెలుసుకొని మరియు వారి సృష్టికర్త అయిన దేవునితో కలసి నడచుటను గూర్చి చూచుటయే మనయొక్క ప్రార్ధనాపూర్వకమయిన కోరిక అయి ఉండాలి.

## విలువలు

- మన జీవితములో ఎదురయ్యే ప్రతి ప్రశ్నకు దేవుని వాక్యము పునాదిగా ఉండాలని నిర్ణయించుటకు.
- ప్రతి పురుషుడు మరియు స్త్రీ దేవుని యొక్క ప్రేమను అర్ధము చేసుకొని వారి మధ్యలో యేసు ప్రభువుని ప్రతిబింబిచే విధముగా వారిని ఉత్తేజపరచుటకు.
- ఏవిదముగా తండ్రి తనవైపు మన అందరిని ఆకర్షిస్తారో ఆ విదముగా దేవుని వాక్యమును అధ్యయనము చేయాలి అనే ఆశను కల్పించుటకు.
- వారపు పరిచర్య యొక్క ప్రతి తరగతి అంశమును గూర్చి దేవుని మీద పూర్తిగ ఆధారపడి ప్రార్ధన చేయాలి అనే విషయాన్ని అభ్యసించుటకు.
- విభిన్నమయిన నమ్మకాలతో ఉన్న వ్యక్తులు, దేవుని వాక్యమును అధ్యయనము చేసి సత్యమును తెలుసుకొనుటకు ఒక ప్రదేశము దగ్గరకు ఆహ్వానించుటకు.
- ప్రేమించుట మరియు సేవాతత్వము లోని ఐక్య ఉద్దేశ్యమును ప్రతిభింభించుటకు.
- ప్రతి నాయకుడిని దేవుడు దేనికొరకయితే పిలిచాడో, దాని కొరకు శిక్షణ ఇచ్చి సిద్ధపరచుటకు.

## గురి

- ప్రతి సభ్యుడు అన్ని సమయములలో దేవునితో ఐక్యమై, సంబంధము కలిగి యుండునట్లు చూచుటకు (ప్రశ్నలకు సమాధానములు)
- రోజువారి జీవితమును పరిశుద్ధగ్రంధముపూతో , సంబంధము కొనసాగించుటకు లేదా పోల్చి సరిచేసుకొనుటకు గల సామర్ధ్యమును పెంపొందించుటకు.
- క్రమముగా ఇతరులకొరకు ప్రార్ధన చేయుటకు.
- సమాధానముల కొరకు దేవుని వాక్యము వైపు తిరుగటయందు అభివృద్ధిపొందుటకు.
- ప్రతి సభ్యుడు చర్చించే సమయములలో దానిలో నిమగ్నమయ్యే విదముగా ప్రోత్సహించుటకు.
- దేవుడు చేసిన మరియు చేస్తున్న వాటిని, తెరచిన మనస్సుతో మరియు మనఃపూర్వకముగా ఇతరులతో పంచుకొనేవిధముగా చేయుటకు.
- దేవుని ప్రేమను విస్తరింప చేయుటకు గల అవకాశములను వెదకునట్లు చేయుటకు.

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక: క్రీస్తు యొక్క శరీరము

## రచయిత

ఎఫెసీయులకు వ్రాసిన పత్రికను, అపోస్తులుడైన పౌలు వ్రాసాడని అంతరంగమైన మరియు బాహ్యమైన సాక్ష్యాదార మాటలను బట్టి తెలియపరచబడుతున్నది. యూదుడు, పరిసయ్యుడు మరియు సంఘమును బాదించిన వ్యక్తి అయిన సౌలు, పునరుత్థానుడైన క్రీస్తు చేత మొదటి సంఘ విశ్వాసులను అతిగా బాధించుచున్న దినములలో పిలువబడ్డాడు. ఇతను అంతరంగముగా మరియు బాహ్యముగా పూర్తిగా మార్చబడి విశ్వాసములోనికి వచ్చాడు. ఇతను క్రొత్త పేరును మరియు క్రొత్త పిలుపును పొందియున్నాడు. పౌలునకు, తరతరాలనుడి బయలు పరచబడని గొప్ప విషయాన్ని దేవుడు బయలు పరిచాడు. అది ఏమిటంటే రక్షించే కృప అన్యులకు అందుబాటులో ఉంది అని. ఈ గొప్ప సువార్తను వ్యాపింప చేయుటకు పౌలు మూడు మారులు తన పంపబడిన మిషనరీ ప్రయాణాన్ని పూర్తిచేసాడు, అన్ని సమయాలలోకెల్ల (గొప్ప పంపబడినవాడుగా) మిషనరీగా మరియు క్రొత్త నిబంధన కానానునకు తోడ్పడ్డాడు. అపోస్తలుల కార్యములలో పౌలు యొక్క పూర్తి మారు మనస్సు, అపోస్తలుడిగా పిలువబడినది మరియు అన్యులకొరకైన తన మూడు సువార్త ప్రయాణములను తెలియజేస్తున్నది. దేవుడు ఎటువంటి హృదయాన్ని అయినా మరియు జీవితాన్ని అయినా మార్చగలడు అని అనుటకు పౌలు జీవితమే సాక్ష్యము.

## కాలము / సమయము

పౌలు ఈ పత్రికను క్రీ.శ 60-62 మధ్యలో వ్రాసారు అని చాలా మంది నమ్ముతారు. ఆ దినాలు అపోస్తలుల కార్యములు 28 లో తెలియచేసినట్లుగా, పౌలు రోమాలో గృహ నిర్బందముగా ఉంచిన దానిని తెలియజేస్తున్నది. కదలలేని మరియు కష్టతరమైన పౌలు జీవితములోని ఈ సమయాన్ని దేవుడు ఇతరుల మంచి కొరకు ఉపయోగించాడు. అప్పుడు పౌలు పరిచర్య కొద్దిగా ఉన్నను, గొప్ప సువార్తను రోమా సైనికులకు, దేవాలయ పెద్దలకు, తనను చూడడానికి వచ్చిన ప్రతి వారికి వివరించెను. బందీగా ఉన్న సమయములలో ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, కొలస్సయులకు, ఫిలేమోనునకు నాలుగు పత్రికలను వ్రాసెను. వీటిలోని మూడు పత్రికలు ఎఫెసీతో కలిపి తన రెండవ ప్రయాణములో తాను ఏర్పరచిన సంఘములకు పత్రికలు వ్రాసెను. (అపోస్తలుల కార్యములు 20:13)

## ఎవరికి వ్రాసెను / ప్రేక్షకులు

ప్రస్తుతము పిలువబడుతున్న టర్కీ లోనిది, పురాతనమైన ఎఫెసీ చాలా ప్రాముఖ్యమైనది మరియు వ్యూహాత్మకముగా రోమీయుల ప్రాంతమైన ఆసియా మైనర్ అన్యుల పట్టణముగా ఉన్నది. నౌకాశ్రయ పట్టణముగా, ఇది చాలా వివిధ రకాల ప్రజలతో, వివిధ ప్రాంతాలలో నుండి వచ్చిన వారితో నిండియున్నది. పౌలు తనయొక్క రెండవ ప్రయాణపు చివరిలో, అతను ఎఫెసీని చాలా తొందరగా దర్శించి, మరలా వస్తానని వాగ్దానమిచ్చి వెళ్ళెను (అపోస్తలుల కార్యములు 18:19-20). తరువాత మరలా వచ్చాడు. తన యొక్క మూడవ సువార్త ప్రయాణములో, దేవుడు పౌలును ఎఫెసీలో దాదాపు 3 సంll ఉండుటకు అనుమతి ఇచ్చెను. ఈ సమయములో కొంతమంది విశ్వాసముగల ప్రజలు, యేసు సువార్తను గూర్చి, సంఘము యెదుగుదలను గూర్చి స్పందించిరి. అప్పుడు ఎఫెసీ

ప్రాంత ప్రజలు, రోమా దేవత డయానాను ఆరాధిస్తున్నారు. కాని దేవుని సువార్త దర్శించినప్పుడు, వారి విధానముల నుండి, చాలా మంది నిజదేవుని వైపు తిరిగినారు. వారియొక్క మాయ, మంత్ర పుస్తకములను తగులబెట్టి, వారి పాత జీవితాన్ని యేసు ప్రభువులోని క్రొత్త జీవితానికొరకు వదలిపెట్టిరి. నీ జీవితములో ఇంకా ఏమైనవి దేవుని దగ్గర పెట్టడానికి ఉన్నాయా? అప్పుడు దేవుడు గొప్ప స్వతంత్రతను ఇచ్చి గొప్ప పరిమాణములో నిన్ను వాడుకొంటాడు. మన జీవితాలలో ఉన్న పాపాలను తెలియజేయమని, వాటిని చూచుటకు మన కన్నులను తెరువమని మన దేవున్ని ప్రాధేయపడదాము.

## అంశము

ఈ సూచన (ఎఫేసీ) పత్రిక, ఆచరణాత్మక సలహాలు, ప్రోత్సహించడములను కలిపి, యేసుక్రీస్తు ప్రభువునందు ఎన్నో ఆశీర్వాదములు ఉన్నవి అని గుర్తు చేయుటకు, మనకు ఇవ్వబడిన ఈ విలువైన జీవితాన్ని జాగ్రత్తగా జీవించాలని ఈ పత్రికను పౌలు మందలిస్తూ వ్రాసెను. ఇది రెండు అంశాలుగా ఉన్నది. స్థాన నిజాలు మరియు ఆచరణాత్మక నిజాలు. మొదటి మూడు అధ్యాయములలో, పౌలు దేవుని ప్రణాళిక అయిన విమోచన మరియు క్రీస్తు విశ్వాసులైన మన స్థానాలను వివరించాడు. క్రీస్తు మన కొరకు ఏమి చేసాడు, గొప్ప ఆశీర్వాదములు, క్రీస్తు ద్వారా మనకు దేవునితో గల సంబంధమును నేర్చుకుంటున్నాము. పౌలు, మన జీవితములోని విషయాలు చాలా స్పష్టముగా ఉండాలని చెప్పుచున్నాడు, ఎందుకంటే మనము క్రీస్తు దగ్గరకు తీసుకొని రాబడ్డాము. అతను గొప్ప సత్యాన్ని తెలియజెప్పాడు, ఇంతకు ముందుకు వరకు ఎవరికి తెలియదు - యూదులు మరియు అన్యులు, ఏ బేదము లేకయే రక్షణ అనే బహుమతి వైపునకు ఆహ్వానించబడుట. వారు అందరు కలిసి ఒక శరీరము, ఒకే ఉద్దేశ్యముతో ఉండిరి, ఎందుకంటే వారు కలిసి దేవుని ప్రేమ, కృప పరలోకరాజ్యము ముందు ప్రదర్శించబడినది. పౌలు ఈ అంశమును లేఖనములలో ఉన్న ఒక చక్కని ప్రార్ధనతో ముగిస్తాడు 2:14-19. పరిశుద్ధాత్మ శక్తిచేత బలపరచమని, క్రీస్తు విశ్వాసము ద్వారా వారి హృదయాలలో నివసించమని, వారు లోతైన ప్రేమను గ్రహించాలని, చివరిగా దేవుని యొక్క సంపూర్ణతచేత నింపబడాలని అతను తండ్రి అయిన దేవుని అడిగాడు.

అధ్యాయములు 4 నుండి 6 వరకు తెలియజేసేది, దేవుని యొక్క విమోచన ప్రణాళిక మరియు ఆచరణాత్మకమైన విషయాలలో మనయొక్క పాత్ర. అతను సంఘము యొక్క ఐక్యత గురించి మొదలు పెడతాడు. తరువాత, విశ్వాసులమైన మన జీవితాలు వ్యక్తిగత సంతృప్తి మరియు నిర్లక్ష్యానికి లోనుకావద్దని హెచ్చరిస్తున్నాడు. ఈ కారణమును బట్టి, పౌలు చివరి అధ్యాయములో హెచ్చరించేది ఏమిటంటే, చాలా జాగ్రత్తగా ఉండి, ఆత్మీయ ఆయుధాలను కలిగి శరీరము, అపవాది, ప్రపంచముతో యుద్దము చేయుటకు సిద్దముగా ఉండాలి అని. చివరిగా మన దృష్టి అంతా దేవుని వాక్యము, దేవుని ఆత్మ (6:10-17) మరియు నిరంతర ప్రార్ధన (6:18) ల మీదనే ఉండాలి. ఈ రెండు అంశాలు, సంఘటిత సిద్దాంతమైన "క్రీస్తు నందు మనము నూతన సృష్టి" చేత మద్దతు పలకడమైనది. ఈ పత్రికలో పౌలు "క్రీస్తులో" అనే పదాన్ని చాలా సార్లు ఉపయోగించాడు. ఇది విశ్వాసిని ఆచరణాత్మకమైన మార్పిడిలోనికి తీసుకొని వెళ్ళుతున్నది, ఈ కారణమును బట్టి 1 మరియు 3 అధ్యాయములలో పౌలు "మనము అర్ధము చేసుకొని దానిని ఆచరించాలి"అని ప్రార్ధన చేసాడు. మనము క్రొత్త సృష్టి, ఎందుకంటే మనము క్రీస్తుతో కలసి మరణించి మరియు ఆయనతో కలిసి లేపబడ్డాము, అతని యొక్క గుర్తింపు మరియు ఉద్దేశ్యమును తీసుకొనియున్నాము. ఈ సత్యము పౌలు యొక్క పత్రికకు పునాది.

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక: క్రీస్తు యొక్క శరీరము

---

## మొదటి పాఠము: మొదటి అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: జగత్తుకు పునాది వేయబడకమునుపే, నిత్యత్వపు ఉద్దేశ్యము కొరకు దేవుడు మనలను ఏర్పరచుకొనెను.**

### <u>మొదటి రోజు</u>

**అపొస్తలుల కార్యములు 18:24-28 మరియు 19:1-7 వరకు అధ్యయనము చేయగలరు.**

1. ఎఫెసులో ఎవరు మరియు ఏమి నేర్పించియున్నారు?

2. ఎఫెసులో వున్న నూతనమైన వారి కొరకు పౌలు వద్ద వున్న అధికమైన సమాచారము ఏమిటి?

3. వారు యేసును ప్రభువు మరియు రక్షకుడిగా నమ్ముతున్నాము అని నిరూపించుకోవడానికి వారు ఏమి చేసారు?

4. పెంతెకొస్తు దినమున విశ్వాసుల విషయములో చేసిన విధముగా దేవుడు వారి నిర్ణయమును ఏ రీతిగా (నిశ్చయపరిచాడు) బలపరిచాడు?

### <u>రెండవ రోజు</u>

**అపొస్తలుల కార్యములు 19:8-23 వరకు అధ్యయనము చేయగలరు.**

1. పౌలు యొక్క వర్తమానము వినిన వారి పట్ల పౌలు యొక్క క్రియలు మరియు స్పందనలను ఏ వాక్యములు వివరించుచున్నవి?

2. యేసు యొక్క అధికారము లేకుండా మనము అపవాది యొక్క కార్యములను బందించలేము అనే విషయమును బట్టి మనము ఏమి నేర్చుకొనవచ్చును?

3. ద్వితియోపదేశకాండము 18:9-14 వాక్య భాగములో ఎన్ని విధములైన మాయమంత్రములు ఉన్నాయి వాటిని వ్రాయుము?

4. నీవు ఉంటున్న ప్రాంతములో (సమాజములో) ఏ విధమైన వాటిని చూస్తున్నావు?

5. ఇది నీకు ఏ విధముగా ప్రార్థన చేయాలి అనే విషయమునకు సహాయము చేయుచున్నదా?

## <u>మూడవ రోజు</u>

**అపొస్తలుల కార్యములు 19 వ అధ్యాయము అధ్యయనము చేయగలరు.**

1. ఎఫెసీయులు తమను తాము ఆ రహస్య కార్యముల నుండి ఏ విధముగా పరిశుద్ధపరుచుకున్నారు మరియు శుద్ధిచేసుకున్నారు?

2. ఆసియాలో ప్రసంగించుటకు మరియు బోధించుటకు పౌలు ఎంత సమయమును గడిపాడు?

3. యేసు యొక్క వర్తమానము చెప్పినప్పుడు, ఒకే ఒక్క సత్య దేవుడు అని చెప్పినను వారు అంగీకరించకపోతే మనము ఎలా స్పందించాలి?

## <u>నాలుగవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 1:1-14 వరకు అధ్యయనము చేయగలరు.**

1. పౌలు ఎవరికి వ్రాసెను?

2. దేవుడు విశ్వాసులను ఆశీర్వదించే విధానములు (మార్గములు) వ్రాయుము?
   ఎ. గత కాలపు ఆశీర్వాదములు (4-6 వచనములు)
   బి.వర్తమాన కాలపు ఆశీర్వాదములు (7-14 వచనములు)
   సి.భవిష్యత్తు కాలపు ఆశీర్వాదములు (13-14 వచనములు)

3. క్రీస్తులో నీవు ఏమై యున్నావో అందుకొరకు దేవునికి కృతజ్ఞతలు!

## <u>అయిదవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 1:15-23 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు దేవునికి కృతజ్ఞత చెల్లించే విషయములో అతను కలిగి యున్న రెండు గుణలక్షణములు ఏమిటి?

2. నీవు దేని కొరకు ఎదురు చూస్తున్నావు అని ప్రజలు నీ గురించి తెలుసుకోవాలని నీవు అనుకుంటున్నావు?

3. 17-18 వచనముల ప్రకారము పౌలు దేవుడిని ఎఫెసీయుల కొరకు అడిగిన వాటి జాబితాను వ్రాయుము?

4. 18-19 వచనముల ప్రకారము పౌలు ఎఫెసీయులు వేటిని తెలుసుకోవాలని కోరుకున్నాడో వాటి జాబితాను వ్రాయుము?

5. నీకు తెలిసిన వారి ఎవరికొరకైనా నీవు ఇప్పుడు ఈ ప్రార్థనను చేయగలవా?

6. దేవుడు మన ద్వారా తన శక్తిని ఎలా నమ్మిన వారి యెడల వ్యక్తపరుస్తున్నాడు?(20-22 వచనములు)

7. సంఘమంతటికి శిరస్సు ఎవరు?

## <u>ఆరవ రోజు</u>

**పాఠము 1:** **"విశ్వాసులకు ఆశీర్వాదములు."**

| | |
|---|---|
| **మూలము:** | **ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఎఫెసీయులకు 1:3 "మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోకవిషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను."** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **జగత్తుకు పునాది వేయబడకమునుపే, నిత్యత్వపు ఉద్దేశ్యము కొరకు దేవుడు మనలను ఏర్పరచుకొనెను.** |
| **జీవితపు మూలసూత్రము:** | **మన జీవితము చాలా విలువైనది ఎందుకనగా దేవుడు నిత్యత్వపు ప్రణాళికను మనకు అనుగ్రహించెను.** |

## సారాంశము:

అప్పటి నిజమయిన వాడుక భాషలో పౌలు ఈ పత్రికను స్తుతి కీర్తనతో మొదలు పెట్టి దీనిని ఒకే వచనములో వ్రాసాడు (3 నుండి 4 వచనములు) తడబాటు లేని, సత్యమైన దేవుని పిల్లలుగా ఉన్నప్పుడు మనకు ఆత్మీయ ఆశీర్వాదములు ఉంటాయని పౌలు వ్రాసి పెట్టాడు. సృష్టికర్తయైన దేవుని ద్వారా విలువచే నింపబడిన జీవితములు మనము కలిగియున్నాము. మనము ఒక ఉద్దేశ్యము నిమిత్తము ఎన్నుకొనబడ్డాము. జగత్తు పునాది వేయబడక మునుపే మనము ఆయన వారముగా ఉండవలెనని సంకల్పించెను.ఆయన కృపామహదైశ్వర్యమును బట్టి మనకు

విమోచన, పాపక్షమాపణ కలిగి యున్నది. క్రీస్తులో అన్ని విషయములను సంక్షిప్త పరుస్తూ ఆయన తన దయాసంకల్పము చొప్పున తన చిత్తమును గూర్చిన మర్మమును మనకు తెలియజేసెను. దేవుని కుటుంబములోనికి మనము వారసత్వము కలిగియున్నాము. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొని, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిమి. ఇది ఎంత శక్తివంతమైన జ్ఞానము మరియు మన హృదయములకు ఎంతో ప్రోత్సాహకరమైనది!

దేవుడు దేనినైతే నెరవేర్చాడో దానిని గూర్చిన గొప్ప కీర్తన అందించిన తరువాత సువార్తను మనము నిజముగా అర్థము చేసికొనవలెనని ప్రార్థించెను. దేవునిని తెలిసికొనుట యందు జ్ఞానము, ప్రత్యక్షత కొరకు ప్రార్థించెను దేవుని సత్యము మన వ్యక్తిగత అనుభవము ద్వారా రూపాంతరములోనికి నడిపించి మూడు విషయములలో మన మనోనేత్రములను తెరువబడవలెనని ప్రార్థించెను.

1. దేవుడు మనకు నిజమైన జ్ఞానము మరియు దేవుని గూర్చిన జ్ఞానము దయచేయాలి.
2. పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమెట్టిదో నమ్మకమైన విశ్వాసముతో మనము అర్థము చేసికొనుటకు దేవుడే కారణము (అబ్రాహాము మొదలుకొని నేటి వరకు)
3. నేడు మనకు అందుబాటులో ఉన్న ఆయన పునరుత్థానము శక్తి యొక్క సాటిలేని గొప్పతనమును మనము అర్థము చేసికొనగలము

హెబ్రీయులకు మరియు కొలొస్సీయులకు వ్రాసిన పత్రికలను మొదలుపెట్టినట్లుగానే, పౌలు తాను ఎఫేసీయులకు వ్రాసిన పత్రికలో కూడా క్రీస్తు యొక్క ప్రాధాన్యమును పొందుపరిచాడు. శరీరముపై శిరస్సు ఎలాగునో అలాగే దేవుడు క్రీస్తునకు కూడా సంపూర్ణమైన అధికారమును ఇచ్చియున్నాడు. సంఘము ఆయన శరీరము మరియు ఆయన దానికి శిరస్సై యున్నాడు. దేవుని ఉద్దేశ్యములను నిర్వహించుటకు మరియు వ్యక్తపరుచుటకు మనము ఎన్నుకోబడ్డాము. సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై (ఎఫెసి 1:23)ఉండుటయే సంఘము యొక్క ఉద్దేశ్యము. నీవు ఎప్పుడైన నిన్ను గురించి ఈ విధముగా ఆలోచించితివా? దేవుడు నిన్ను గురించి అలోచించినట్లుగా, నిన్ను గూర్చి నీవు ఆలోచించుటకు ఎప్పుడయినా ధైర్యము చేసావా? దేవుడు తానే నీ దేహములో పూర్తిగా నిండి, ప్రవహించునట్లు? ఒక్క క్షణము వెచ్చించి దీనిని గురించి నీ స్వంత మాటలలో వ్రాసి ఇతరులను గురించి ప్రార్థన చేయుడి.

***మన జీవితము చాలా విలువైనది ఎందుకనగా దేవుడు నిత్యత్వపు ప్రణాళికను మనకు అనుగ్రహించెను.***

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక: క్రీస్తు యొక్క శరీరము

---

## రెండవ పాఠము: రెండవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: మునుపు మనము పరదేశులము మరియు దేవుని నుండి వేరుచేయబడిన వారము, కాని ఇప్పుడు విశ్వాసులమైన మనము దేవుడు నివసించే నివాస స్థలమై యున్నాము.**

### మొదటి రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:1-3 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఒక వ్యక్తి పాపములో చనిపోతే ఆయన యొక్క క్రియలు మరియు స్థితి ఎలాగుంటుందో ఆ జాబితాను వ్రాయుము?

2. క్రీస్తు నుండి ప్రత్యేకముగా ఉంటే, మనము దేనికి పాత్రులమవుతాము?

### రెండవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:4-10 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడు మన కొరకు చేసిన(లేదా చేయబోయే) కార్యములను వ్రాయుము?

2. 8-9 వ వచనము ప్రకారము,మనము ఎలా రక్షించబడ్డాము?

3. ఒకరు విశ్వాసమును ఎలా పొందుకుంటారు?(రోమా 10:17 ను చూడుడి)

4. మనము ఏమి చేయవలెనని దేవుడు సృష్టించెను?

5. ఈ సమయములో నీ జీవితములో దేవుడు నీవు చేయుట కొరకు సిద్ధపరచిన మంచి కార్యములు ఏమిటి?

## <u>మూడవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:11-12 వరకు అధ్యయనము చేయగలరు**

1. క్రీస్తు పూర్వము అన్యుల(మన) యొక్క పరిస్థితిని వివరించుము?

2. క్రీస్తు తరువాత అన్యుల(మన) యొక్క పరిస్థితిని వివరించుము?

3. నీ జీవితములో ఏ పరిస్థితి మంచిది, దానిని వివరించుము?

## <u>నాలుగవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:13-18 వరకు అధ్యయనము చేయగలరు.**

1. 13 వ వచనము ప్రకారము,దేవునికి సమీపస్థులను చేయునది ఏమిటి?

2. 14 అ వచనము ప్రకారము,క్రీస్తును ఏవిధముగా వివరించవచ్చును?(15 నుండి 17 వచనములను కూడా చూడుడి)

3. తండ్రి దేవుడిని మనము ఎలా చేరగలము?(17,18 వచనములు)

4. నీ వ్యక్తిగత జీవితములో ఈ అనుభవము ఉన్నదా?

## <u>అయిదవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 2:19-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ అధ్యాయములోని భాగము ప్రకారము క్రైస్తవుల దృష్టిలో సాంఘీకముగా(లోక పరమయిన) మరియు జాతి,కుల,మత బేధములు ఎలా ఉంటాయి?

2. ఈ వాక్య భాగ ప్రకారము,పునాది ఎవరు మరియుమూలరాయి ఎవరు?

3. 1 కొరింథి 3:16 ప్రకారము క్రీస్తు ఎక్కడ నివసించును?

4. ఈ రోజు దేవుని యొక్క మందిరము ఎక్కడ ఉన్నది?

## ఆరవ రోజు

### పాఠము 2: "విశ్వాసి యొక్క అంతస్థు"

| | |
|---|---|
| **మూలము:** | ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయము |
| **మూలవాక్యము:** | ఎఫెసీయులకు 2:10 "వాటియందు మనము నడుచుకొనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై, మనము క్రీస్తుయేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము." |
| **పాఠ్యాంశ వాక్యము:** | మునుపు మనము పరదేశులము మరియు దేవుని నుండి వేరుచేయబడిన వారము, కాని ఇప్పుడు విశ్వాసులమైన మనము దేవుడు నివసించే నివాస స్థలమై యున్నాము. |
| **జీవితపు మూలసూత్రము:** | దేవుడు ఎల్లప్పుడు మనతోనే ఉన్నాడు మరియు మనలను ఎన్నడు విడువను ఎడబాయను అని ఆయన వాగ్ధానము చేసెను. |

### సారాంశము:

2 వ అధ్యాయము నందు, క్రీస్తు సిలువ మీద చేసిన పని కంటే ముందు ఉన్న మన అత్మీయ స్థితితో ప్రారంభమవుతుంది. పడిపోయిన మానవులముగా,మనము అత్మలో మరణించిన వారము. మనము దేవునికి అవిధేయులము మాత్రమే కాదు, కాని మనము ఆయనలో చనిపోయిన వారము.మనలో ఎంత మాత్రము అత్మీయ జీవము లేదు. దుష్టత్వము(పాపము)మనము చేసినది కాదు, మనమే దుష్టత్వము(పాపము) అయియున్నాము. మనము దేవునికి శత్రువులము, అపవాదికి మిత్రులము మరియు శాపమునకు పాత్రులమయిన పిల్లలము. మనము వేరు చేయబడిన వారము, ఇశ్రాయేలు పౌరసత్వము నుండి బహిష్కరించబడిన వారము దేవుని వాగ్ధానములకు మరియు నిబంధనలకు పరదేశులము,నిరీక్షణ లేని వారము మరియు లోకమందు దేవుడు లేని వారమునై యున్నాము.

అదృష్టవశాత్తు పౌలు ఈ దుర్వార్తను ఒక మహత్తరమైన నిరీక్షణ సందేశముతో ఆటంక పరుస్తాడు. ఇందులో శుభవార్త దుర్వార్తను అదిగమిస్తుంది." అయినను దేవుడు కరుణాసంపన్నుడై యుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సయితము మనయెడల చూపిన తన మహా ప్రేమచేత

మనలను క్రీసు తో కూడా బ్రతికించెను. కృపచేత మీరు రక్షింపబడియున్నారు."(ఎఫెసి 2:4,5) క్రీస్తు సిలువ రక్తము ద్వారా దేవునితో ఐక్యపరచబడ్డాము. మనము చనిపోయినవారమయినను మనము ఐక్యపరచబడ్డాము. క్రిందట మనము శత్రువులము అయినను దేవునితో సమాధానము కలిగియున్నాము, క్రీస్తు ద్వారా దేవునితో ఐక్యపరచబడ్డాము. ఇది మన వలన కలిగినది కాదు, కేవలము దేవుని యొక్క కృప మరియు దయ వలననే కలిగెను. మనము కలిగియున్న రక్షణ దేవుని వరమే మనము దీనిని సంపాదించలేము కాని క్రియల వలననే మనము దీనిని వ్యక్తపరచాలి.మనము ఫలించవలెనని దేవుడు మన రక్షణను భద్రపరచెనని చెప్పుచూ పౌలు మనకు జ్ఞాపక పరుస్తూ దీనిని ముగించెను.

11 వ వచనము మొదటిలో చెప్పబడినట్లు అశీర్వాదపు శుభవార్త మరి మేలైనదాయెను.అదే విధముగా మనము దేవునితో మరియు ఒకరితో ఒకరము ఐక్యపరచబడ్డాము. అన్యజనులమైమును ఏకపట్టణస్థులముగా, సహోదరులముగా నిబంధన క్రిందకు తేబడ్డాము.క్రీస్తు చేసిన కార్యము వలన మనము దేవునితో మరియు ఒకరితో ఒకరము సమాధానములోనికి తేబడ్డాము.ధర్మశాస్త్రము మరియు వైరము,అను మధ్య అడ్డుగోడను కొట్టివేయుట చేత మనము ఉభయులను ఏకము చేసెను.మనమందరమును ఏక శరీరముగా ఉండవలెనునదియే మొదటినుంది దేవుని చిత్తము అయి యున్నది. క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయి అయి యుండగా దేవుని పరిశుద్ధ ఆలయమైయుండుటకు మనమందరము ఆయనలో చక్కగా అమర్చబడిన దేవుని నివాసస్థలమైయున్నాము. అని 20,21 వచనములలో పౌలు మనతో సూటిగా చెప్పెను. సిలువలో యూదులకు మరియు అన్యజనులకు మధ్య యున్న అడ్డుగోడ కూల్చివేయబడెను. ఇప్పుడు మనము "ఒక్క నూతన పురుషులమై"యున్నాము. దేశము, కులము, రంగు, సామాజిక స్థితి, రాజకీయ స్థితి, ఆచారములు అను వ్యత్యాసము లోకమును వణికించెను. అయినను అది క్రైస్తవులలో నిషేధమాయెను.క్రీస్తు యొక్క సిలువ మరియు రక్తము ద్వారా మనమందము ఒకే కుటుంబముగాను, సహోదరి సహోదరులుగాను మరియు దేవుని పిల్లలమైతిమి. క్రీస్తునందు సహోదరీ సహోదరులమైన వారితో నిన్ను నీవు పొరపాటుగా వేరు పరుచుకొనుచున్నావా? దయచేసి అలోచించుము!

***దేవుడు ఎల్లప్పుడు మనతోనే ఉన్నాడు మరియు మనలను ఎన్నడు విడువను ఎడబాయను అని ఆయన వాగ్దానము చేసెను***

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక : క్రీస్తు యొక్క శరీరము

---

## మూడవ పాఠము: మూడవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: దేవుని యొక్క ఉద్దేశ్యము (ప్రణాళిక) ఇప్పుడు సంఘము ద్వారా తెలియపరచబడుచున్నది**

### మొదటి రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 3:1-6 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు రోమాలో గొలుసులతో ఉన్నప్పుడు "నేను క్రీస్తు యొక్క ఖైదీని"(3:1) అని ఎందుకు అన్నాడు అని నీవు అనుకొనుచున్నావు?

2. ముందు వేరే తరము వారికి తెలియని మర్మము ఏమిటి?

3. యూదులు ఈ మర్మమును అంగీకరించడము ఎందుకు చాలా కష్టము అయ్యింది?(రోమా 16:25-26 వాక్యభాగములను చూడుడి)

4. యూదులకు మరియు అన్యులకు ఇప్పుడు చెప్పుటకు ఏమి చెప్తావు?

### రెండవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 3:7-13 వరకు అధ్యయనము చేయగలరు**

1. 8 వ వచనము నుండి పౌలు యొక్క పిలుపు ఏమిటి?

2. 9-10 వచనముల ప్రకారము దేవుని జ్ఞానము ఎవరెవరికి తెలియజేయవలెనని దేవుడు అనుకున్నాడు?

3. ఇప్పుడు మనము దేవుడిని (దేవుని యొద్దకు ఎలా రాగలము?)ఎలా కలుసుకోవచ్చును?

### మూడవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 3:14-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు ఈ ప్రార్థన చేయుటకు గల కారణము ఏమిటి?

2. పౌలు తన యొక్క ప్రార్థనలో అడిగిన విషయములు ఏమిటి?

3. నీకు తెలిసిన వారెవరికొరకైనా ఈ ప్రార్థన చేయాలని నీవు అనుకొనుచున్నావా?

4. 20 వ వచనము నీ ప్రార్థన జీవితము మార్చునని ఎలా నమ్మగలము?

## <u>నాలుగవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 3:14-21 వరకు అధ్యయనము చేయగలరు.**

1. "దేవుని సంపూర్ణతయందు సమానమైన సంపూర్ణులగునట్లు" అనే క్రమములో దేవుడి నుండి వచ్చిన వినతి ఏమిటి?

2. "దేవుని సంపూర్ణతయందు సమానమైన సంపూర్ణత" గలిగిన వారు బాహ్య జీవితములో(లోకములో),వారి కుటుంబములో,మరియు వారి అనుదిన జీవితములో ఎలా ఉంటారో వివరించుము?

## <u>అయిదవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 3:20-21 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడు నీ జీవితములో ఎప్పుడయినా నీవు అడిగిన దాని కంటే ఎక్కువ ఇచ్చాడా? అయితే దానిని వివరించుము?

2. మన లోపల పని చేసే శక్తి ఏమిటి?

3. 20-21 వ వచనముల నుండి దేవుని గురించి నీవు ఏమి నేర్చుకొనుచున్నావు, ఈ రోజు నీవు ఏమై యున్నావో అక్కడ నీవు నేర్చుకొనినది నీకు సహాయపడుచున్నదా?

## ఆరవ రోజు

పాఠము 3: " సంఘము యొక్క మర్మము "

| | |
|---|---|
| **మూలము:** | **ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక మూడవ అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఎఫెసీయులకు 3:6 "ఈ మర్మమేదనగా అన్యజనులు, సువార్తవలన క్రీస్తుయేసు నందు, యూదులతోపాటు సమానవారసులును, ఒక శరీరమందలి సాటి అవయవములును, వాగ్దానములో పాలివారలునై యున్నారను నదియే."** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **దేవుని యొక్క ఉద్దేశ్యము (ప్రణాళిక) ఇప్పుడు సంఘము ద్వారా తెలియపరచబడుచున్నది.** |
| **జీవితపు మూలసూత్రము:** | **వాగ్దానము లేదా దేవుని ఉద్దేశ్యము (చిత్తము) కొరకు కనిపెట్టుడి** |

**సారాంశము:**

తాను హింసించబడడానికి గల కారణాన్ని మరియు కృపను అన్యజనులకు ప్రకటించుటకు గల కారణాన్ని పౌలు ఈ అధ్యాయములో తెలియపరచాడు. తాను భోదించుచున్న విషయాలు పరిశుద్ధాత్ముని సహాయము ద్వారా తండ్రి అయిన దేవునినుండి పొందుకొన్నానని ఎఫెసీయులకు మరొక్కసారి స్పష్టము చేసాడు. పౌలు ఒక రెండు విషయాలను బహిర్గతము చేసాడు. మొదటిగా, క్రీస్తు, అన్య జనులను బానిసత్వము నుండి విడిపించుటకై, ధర్మశాస్త్రమంతటిని చేసి ముగించాడనే సత్యము. రెండవది, క్రీస్తుని త్యాగము వలన, అన్య జనులు కూడా యూదులతో సమానవారుగా అనగా, జత పనివారిగా చేయబడ్డారు. వారు ఎటువంటి వంశానికి చెందిన వారైననుసరే, క్రీస్తులో అందరూ ఒక్కటే. విశ్వాస మూలముగా అందరును దేవుని రాజ్యములోనికి ఆహ్వానించబడ్డారు. మునుపటి కాలములలో అనగా పాతనిభందనా కాలములలో, దేవుని వారసత్వమును గూర్చి కేవలము ఒక జాతికో, ఒక వంశానికో తెలియపరచబడినది. కాని కొంత కాలము గడచిన తరువాత, దేవుడు అపోస్తులులలో చివరివాడను అని ప్రకటించుకొన్న పౌలును ఎన్నుకొని దేవును జ్ఞానాన్ని ఆయన కృపను అ న్య జనులకునూ అందచేసాడు. మరొక్క ప్రార్ధన ద్వారా పౌలు ఈ అధ్యాయమును ముగించాడు.

తండ్రియెదుట పౌలు మోకాళ్లూని, ప్రజలు అంతరంగ పురుషునియందు శక్తికలిగి ఆయన ఆత్మ వలన బలపరచబడునట్లుగాను, హృదయములలో విశ్వాసముద్వారా నివసించునట్లుగాను దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరు పారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతో కూడ దాని వెడల్పు పొడుగు లోతు ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెనని ప్రార్ధించాడు.

పౌలు యొక్క ప్రార్ధనకు ఈనాడు మన జీవితములు జవాబుగా నిలచాయి. ప్రభువుచే వాడబడేపాత్రలుగా, లోకానికి ఆయన కృపను పరిచయము చేసేవారిగా మనము యున్నాము. మన జీవితములలో ఎన్నో కృపా కార్యాలను అనుభవించే యుంటాము. పౌలు వాటినే క్రీస్తు ఐశ్వర్య ము అని పిలిచాడు.

కృపాకార్యాలు నానా విధములుగా యుండవచ్చు. కాని అవియన్నియు దేవుడు తన వారి జీవితాలలో చేసే గొప్పపైన కార్యాలను తెలియపరుస్తాయి. ఒకరోజు మనందరి జీవితాలలో ఆయన చేసిన నానా విదమైన కృపాకార్యాలు ఒకటిగా నిలచి సాతానుడి దళములను, పాపాన్ని నాశనము చేస్తాయి. చివరిగా ఒక మాట, మన జీవితాలలో, ప్రజలు కృపా కార్యాలను చూసినప్పుడు, వారి జీవితాలు కూడా మార్చబడుతాయి.

**మనము యిప్పుడు చనిపోయిన వారము కాదు గాని కృపా సాక్ష్యమును ప్రకటించుటకై బ్రతికియున్న వారము.**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక : క్రీస్తు యొక్క శరీరము

## నాలుగవ పాఠము: నాలుగవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము:** **మనము ఐక్యతగా ఉండుట కొరకు కలిసి యున్నాము మరియు మనమందరము కలిసి ఒక శరీరముగా సేవ చేయుట కొరకు పిలువబడ్డాము.**

### మొదటి రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4:1-3 వరకు అధ్యయనము చేయగలరు**

1. మన పిలుపుకు తగినట్లుగా మనము నడుచుకొనవలెనని పౌలు ఏవిధముగా చెప్పాడు?

2. ఏ ఐక్యమును మనము కాపాడుకొనవలయును?

3. మనము ఎలా కాపాడుకొనగలము?

4. మూఢవిశ్వాసమునకు లోబడకుండా సమాధానములో ఈ ఐక్యతను కాపాడుకొనుటకు కొన్ని సలహాలను నీవు ఇవ్వగలవా?

### రెండవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4:4-10 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వచనములను బట్టి మాతో నీవు ఏ విషయములను పంచుకుంటావు?

2. నీవు నీ పిలుపు కొరకు పని చేయుచున్నావా?

3. సామెతలు 6:16-19 ప్రకారము మనము తప్పక దూరపరచవలసినవి ఏమిటి?

4. అన్నింటిలో,అంతటిలో మరియు అందరిలో నివసించుచున్నవారు ఎవరు?

### మూడవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4:11-13 మరియు 1 కొరింథి 12:1-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. వరము అనగా ఏమిటి,దానిని ఎవరు నిర్ణయిస్తారు, దానిని ఎవరు పొందుకోగలరు మరియు ఆ వరము ఎలా కనబడుచున్నది?

2. సంఘమునకు క్రీస్తు అనుగ్రహించిన వరముల పేర్లను వ్రాయుము?

3. మనము కలిగియున్న ఆ వరముతో మన యొక్క బాధ్యత ఏమిటి?

4. ఈ క్రింద ఇవ్వబడిన పదములకు వచనములను వ్రాయుము?తరువాత ఈ అధ్యాయములో ప్రతి ఒక్కటి మరొక దానితో ఐక్యతకు ఇవ్వబడినది:

    ఎ. ఒకే శరీరము

    బి. ఒకే ఆత్మ

    సి. పిలుపు విషయములో ఒకే నిరీక్షణ

    డి. ఒకే దేవుడు

    ఇ. ఒకే విశ్వాసము మరియు ఒకే బాప్తీస్మము

    ఎఫ్. ఒకే దేవుడు మరియు అందరికి తండ్రి

(రోమా 1:17,రోమా 6:3-4,రోమా 8:9,రోమా 10:9-12, 1 కొరింథి 8:6,1 కొరింథి 12:13,ఎఫెసీ 1:13-14,17-18, ఫిలిప్పీ 2:11,కొలొస్సి 1:1-18,1 థెస్సలొనీక 4:15-18,తీతు 2:13,1 యోహాను 3:3,యూదా 1:3)

5. ఐక్యత యొక్క గమ్యము ఏ విధముగా కనబడును?(13 వ వచనము)

## నాలుగవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4:14-16 వరకు అధ్యయనము చేయగలరు.**

1. నీ జీవితములో ఈ క్రిందివి అన్ని అభ్యాసములోనికి ఏ విధముగా మొదలుపెడతావు:

    ఎ.సత్యమును మాట్లాడుట(సువార్త యొక్క వర్తమానము)

    బి. ప్రేమతో సత్యమును మట్లాడుట

    సి. అన్ని విషయములలో క్రీస్తులో ఎదుగుట

    డి. శరీరములోని ఒక అవయము వలె కలుపబడి శరీరమంతటికి సహాయ పడుట

## అయిదవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 4:17-32 వరకు అధ్యయనము చేయగలరు**

1. 17 నుండి32 వచనముల ప్రకారము ఈ క్రింద ఇవ్వబడిన చార్టును నింపండి.

| నీ యొక్క పాత జీవితమును(స్వయమును) వ్రాయుము | నీ యొక్క నూతన జీవితమును(స్వయమును) వ్రాయుము |
|---|---|
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |
| | |

2. నీవు ఏమి చదివినావు పైన వ్రాసిన జాబితాను బట్టి,క్రీస్తులో నీ యొక్క నూతన జీవితమును ఏ విధముగా వివరించెదవు?

3. నీ జీవితములో సాతానుడు ఏ విధముగా క్రిందికి లాగుచున్నాడు?దీని అర్థము ఏమిటి?

4. ఈ వారములో భిన్నముగా(నూతనముగా) నీ జీవితములో నీవు ఏమి మొదలుపెడతావు?

## ఆరవ రోజు

పాఠము 4: " శారీరక జీవితము "

| | |
|---|---|
| **మూలము:** | ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక నాలుగవ అధ్యాయము |
| **మూలవాక్యము:** | ఎఫెసీయులకు 4:1,2 "దేవుడు దేని కొరకు అయితే నిన్ను పిలిచాడో ఆ పిలుపుకు తగినట్లు జీవించుము." |
| **పాఠ్యాంశ వాక్యము:** | మనము ఐక్యతగా ఉండుట కొరకు కలిసి యున్నాము మరియు మనమందరము కలిసి ఒక శరీరముగా సేవ చేయుట కొరకు పిలువబడ్డాము. |
| **జీవితపు మూలసూత్రము:** | మన పిలుపునకు తగినట్టుగా జీవించాలి అంటే మన పాత జీవితమును విడచి క్రీస్తు అనుగ్రహించిన నూతన జీవితమును జీవించాలి. |

**సారాంశము:**

పౌలు తన పత్రికలోని మొదటి భాగములలో చెప్పినట్టు సిద్ధాంతపరమైన సత్యములను గాక యిప్పుడు ఆచరణాత్మకమైన విషయాలను భోధించడం మోదలుపెట్టాడు. ప్రభువు యొక్క పిలుపునకు తగినట్టుగా మన ప్రవర్తన యుండాలని పౌలు కోరాడు. నిజానికి పౌలు తప్పు చేసినందుకు హింసించబడలేదు గాని దేవుని రాజ్యములో ఒక పౌరుడిగా యున్నందుకే హింసించబడ్డాడు. మనకు తన జీవితమును చూపించుతూ లోకాన్ని, లోకసంబంధమైన వాటిని విడచిపెట్టి పరలోక సంబంధమైన వాటిని వెతికే వారముగా మనము కూడా యుండాలని పౌలు కోరుతున్నాడు. క్రీస్తులో మన బ్రతియున్న వారము.ఆయన ప్రవర్తనను ఆయన స్వభావమును ప్రతిభింబించే వారముగా యున్నాము.ఒక నూతన వ్యక్తిగా మనలోని నూతనత్వాన్ని అనగా, తగ్గింపును, ఓర్పును సౌమ్యతను ముఖ్యముగా దేవుని శాంత గుణాన్ని ఇతరులకు చూపించే వారమై యున్నాము. మనము దేవుని శరీరములో అవయవాలుగా యున్నామని ఒకరితో ఒకరము ఐక్యత కలిగియుండాలని పౌలు జ్ఞాపకము చేసాడు. అందరము ఒకే ప్రభువును, ఒకే పిలుపును, ఒకే నిరీక్షణను, ఒకే విశ్వాసమును మరియు ఒకే బాప్తీస్మమును కలిగిన వారము. అయితే, మనలోని కొందరు అపోస్తలులుగాను, కొందరు ప్రవక్తలుగాను, కొందరు సువార్తికులుగాను, కొందరు సంఘనాయకులుగాను మరికొందరు భోధించే వారుగాను నియమించబడినాము. వీటిని గూర్చి రోమా 12 లో మరియు 1కొరంధీ 12 లో విశేషముగా ప్రస్తావింపబడింది. మన తలాంతులు మన నైపుణ్యతను బట్టి ఈ విశేషమైన కార్యాలను మనము చేయలేము. కేవలము పరిశుద్ధాత్ముని వలననే అది సాధ్యము. క్రీస్తుని శరీరమైన దేవాలయపు ఎదుగుదలకై అవి పరిశుద్ధాత్ముని ద్వారా ప్రతీ విశ్వాసికి ఉచితముగా అందింపబడ్డాయి. కృపావరాలు మనలో విభేదాలకై కాదు గాని క్రీస్తు లో ఐక్యత కొరకై అందించబడినాయి. ఒకరిని ఒకరు ప్రేమించుట అనునది వరముల కంటెను ప్రాముఖ్యమైనది. అదే విధముగా మనము ఒక్కొక్కరిగా కాకుండా అందరము ఐక్యముగా, పనిచేయుట

ముఖ్యమైనది. శరీరములోని అన్ని భాగాలు పనిచేసినప్పుడు మాత్రమే, శరీరము ఆరోగ్యముగా ఉంటుంది. అటువలే, మనమందరము కలిసి పనిచేస్తేనే దేవుని పరిచర్య ఆరోగ్యదాయకముగా ఉంటుంది. ఇప్పుడు మన తక్షణ కర్తవ్యము, మనకు అందచేయబడిన వరమును తెలుసుకోవడమే. అలా చేసినప్పుడు సంఘ అవసరతను తీర్చినవారమౌతాము. ప్రియ చదువరీ! మీ వరము ఏమిటో, ఆ వరముతో సంఘానికి ఏమి చేయవలెనో మీరు గ్రహించారా? ఒకప్పుడు చనిపోయిన వారము.యిప్పుడు క్రీస్తులో బ్రతించబడినవారము. లోకమును అందులోని సమస్తమును విడచిపెట్టిన వారము. ముఖ్యముగా క్రీస్తు పోలికగా చేయబడినవారము అని గ్రహించుదుము గాక!

| **పాత జీవితపు లక్షణాలు** | **క్రొత్త జీవితపు లక్షణాలు** |
|---|---|
| అసత్యవంతమైన స్వభావము | సత్యవంతమైన స్వభావము |
| కోపము | కోపపడుడి కాని పాపము చేయకుడి |
| దొంగలించడము | కష్టపడే మనస్సు |
| విస్తారమైన మాటలు | కృపను కలిగించేమాటలు |
| ద్వేశము/ఆగ్రహము | క్షమించే గుణము |

***మన పిలుపునకు తగినట్టుగా జీవించాలి అంటే మన పాత జీవితమును విడచి క్రీస్తు అనుగ్రహించిన నూతన జీవితమును జీవించాలి.***

---

## అయిదవ పాఠము: అయిదవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము:** మనము దేవుడిని అనుకరించుచునప్పుడు,మనము వెలుగులో జీవించాలి మరియు ప్రేమలోనే నడవాలి.

### మొదటి రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5:1-2 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని వెంబడించుటకు,అనుకరించుటకు మనము ఎవరి జీవితమును చూడాలి?

2. దేవునికి మన యెడల తనకున్న త్యాగ పూర్వకమైన ప్రేమను ఎలా చూపించాడు?

3. జీవము యొక్క ప్రేమను వివరించుము?(1 కొరింథి 13:4-7 మరియు యోహాను 3:16 చూడుడి)

### రెండవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5:3-9 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుని ప్రజలకు ఏ విధమైన మనస్తత్వము(స్వభావము) మరియు ఏ విధమైన ప్రవర్తన తప్పనిసరి ఉండకూడదు?

2. ఒక వ్యక్తి యేసును వెంబడించుచున్నాడు అనుటకు సూచన(గుర్తు) ఏమిటి?

3. ఈ లోకములో వెలుగు సంబంధమైన ప్రజలు దేనిని ప్రతిబింబించాలి?

### మూడవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5:10-13 వరకు అధ్యయనము చేయగలరు**

1. దేవుడిని సంతోష పెట్టునది ఏది అని మనకు ఎలా తెలియును?

2. అంధకార క్రియలలో పాలి వారైయున్న వారి మీద వెలుగు యొక్క ప్రభావము ఎలా ఉంటుంది?

3. ఈ దినాలలో విశ్వాసుల జీవితాలలో ఇది సంభవించుట నీవు చూచుచున్నావా? ఎందుకు లేదా ఎందుకు కాదు?

## నాలుగవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5:14-20 వరకు అధ్యయనము చేయగలరు.**

1. 14,15 మరియు17 వ వచనముల ప్రకారము వెలుగులో నడువనటువంటి వారిని గురించి పౌలు ఎలా వివరించాడు?

2. ఆ వచనములను అధారము చేసుకొని,మనము జ్ఞానముగా ఎలా జీవించాలి?

3. మనము మత్తుతో మత్తులైయుండకుడి కాని ఆత్మ పూర్ణులై యుండుడి అని పౌలు చెప్పెను.ఇది సరియైన పోలికనేనా?

4. ఈ వచనముల ప్రకారము ఆత్మతో నింపబడిన ఒక విశ్వాసిని గురించి వివరించుము?

## అయిదవ రోజు

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 5:21-32 వరకు అధ్యయనము చేయగలరు**

1. 21 వ వచనము యొక్క అర్థము ఏమిటి? ఎందుకు ఈ వచనము ఈ లేఖన భాగమంతటికి మూలమై యున్న వాక్యమని నీవు అనుకొనుచున్నావు?

2. భార్యలకు ఏ విధమైన త్యాగము అవసరమని పౌలు చెప్పుచున్నాడు?అదే విధముగా భర్తలకు ఏ విధమైన త్యాగము అవసరమని పౌలు చెప్పుచున్నాడు?

3. ఈ భాగములో పౌలు వివరించిన గొప్ప మర్మము ఏమిటి?

4. నీ సమాజములో వివాహముల ద్వారా ఒకరినొకరు సమర్పించుకొనుట అనేది ప్రతిబింబించుట నీవు చూచియున్నావా?

5. ఈ అధ్యాయము నుండి,దేవుడు నిన్ను సంధించిన(తేట పరిచిన) ఒక విషయమును తీసుకొని మాకు వివరించుము?

## **<u>ఆరవ రోజు</u>**

**పాఠము 5: " వెలుగులో నడుచుట "**

| | |
|---|---|
| **మూలము:** | **ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక అయిదవ అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఎఫెసీయులకు 5:21 " క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడియుండుడి."** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **మనము దేవుడిని అనుకరించుచునప్పుడు,మనము వెలుగులో జీవించాలి మరియు ప్రేమలోనే నడవాలి.** |
| **జీవితపు మూలసూత్రము:** | **పరిశుద్ధాత్ముడు మన జీవితమును తన అదీనములోకి తీసుకున్నప్పుడు,మన చెడు స్వభావము మరియు క్రియలను మార్చివేసి క్రీస్తు లాంటి స్వభావము మరియు క్రియలుగా మనలనుమార్చును.** |

## **సారాంశము:**

విశ్వాసి తన కార్యాలను సమర్ధముగ నెరవేర్చిన కొలదీ ఆత్మీయ జీవితములో పరిపక్వము చెందుతాడు. చెడు ఆలోచనలు, కఠినత్త్వము కల్మషము,మోసపరచాలనే కోరికలు అబద్దపు మనసు ,కోపము, దొంగతనము, విస్తారముగ మాటలాడే తత్వము, విపరీతమైన కోరికలు, దుర్బుద్ధి, కామము,ధనాశ, అసభ్య ప్రవర్తన, వెర్రి మాటలు పిచ్చి హాస్యాలు, అవివేకము, మత్తు,జారత్వము, మొదలగునవి ఒక విశ్వాసి జయించవలసిన విషయాలు. ఒకప్పుడు మనము చీకటిలో నడచిన వారము కాని ఇప్పుడు వెలుగు సంభందమైన వారమై, వెలుగులో నడచేవారముగా యున్నాము. కేవలము దేవుని మాటలు, పరిశుద్ధాత్ముని సహాయము వలననే, మన ఆలోచనలలో మన ఆత్మీయ జీవితములలో పరిపక్వము చెందగలము.

పరిశుద్ధాత్ముడు మన ఆలోచనా విదానమును మార్చేకొలదీ, మన నడవడి, మన వైఖరి, మన క్రియలు అన్నీ మారుతాయి.శరీర విషయాలపై గాక, ఆత్మీయ విషయాలపై అనగా దేవుని నీతి, పరిశుద్ధత, కష్టపడే తత్వము, నిజాయితి, పంచుట(ఇతరులకు ఇచ్చుట), జాలిగుణము, క్షమించుట, ప్రేమ, కృతజ్ఞత భావన, మంచితనము,

సత్యము, జ్ఞానము, దేవుని చిత్తమును తెలుసుకొనుట, ఒకరికి ఒకరు విధేయులై యుండుట వంటి వాటిపై మన మనస్సు నిలుస్తుంది.మనము ఒక్క రాత్రిలోనే పూర్తిగా పరిపక్వము చెందలేము గాని, పరిపక్వము చెందుటకు మనము చేయవలసిన మొదటి పని, పరిశుద్ధాత్మునికి మనలను మనమే సమర్పణ చేసుకొని, ఆయనకు లోబడి, ఎక్కడ మొదలు పెట్టాలో అని ఆయనను అడగడం.పరిశుద్ధాత్మునికి అడ్డుచెప్పక తన క్రియలు మనలో జరుగుటకు ఒప్పుకొందాము.మన ఆలోచనా విధానము ఏలాగు యుండవలెనో అని తెలియచేసిన పౌలు ఇప్పుడు 6వ అధ్యాయములో ప్రేమను గూర్చి మాట్లాడాడు. ప్రేమ చేత ఒకరికి ఒకరము లోబడి యుండడమే దేవునికి ఇష్టమైన సమర్పణ. మనపైని అధికారులకు లోబడే వారముగాను, మన క్రిందయున్న వారిని శాంతముగ నడిపించే వారముగా యుండాలి. పౌలు అన్య జనులను ప్రేమించి వారికి క్రీస్తును పరిచయము చేయడము మనకు తెలిసిన విషయమే.తనకున్న గొప్ప స్థితిని సైతం విడిచిపెట్టి తాను అన్యజనులను దేవుని రాజ్యము నిమిత్తమై ఉజ్జీవపరచాడు.

స్త్రీలారా, ప్రభువునకువలె మీ సొంతపురుషులకు లోబడియుండుడి, యజమాను లారా,బెదరించుట మాని మీ క్రింద యున్న వారిని శాంతముగా నడిపించుడి అని వాక్యము స్పష్టము చేసింది. క్రీస్తులో అందరము ఒక్కటే జత పనివారము, దేవుని కృపలో నాయకులము. 4వ అధ్యాయములో చెప్పినట్టుగా మనమందరము ఒకే ప్రభువును, ఒకే ఆత్మను, ఒకే పిలుపును కలిగియున్నాము. కాని దేవుని జ్ఞానము చొప్పున మనలోని ప్రేమను నానా విధాలుగా పంచవచ్చు. ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము. మనముకూడ సహోదరులనిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము.(1యోహాను 3:16). స్వనీతి గాని, స్వప్రయోజనమును గాని కోరక మనలోని దేవుని ప్రేమను ఇతరులకు పంచినప్పుడు మనము దేవుని సంబంధులమని అందరు తెలుసుకొంటారు.

***పరిశుద్ధాత్ముడు మన జీవితమును తన అదీనములోకి తీసుకున్నప్పుడు,మన చెడుస్వభావము మరియు క్రియలను మార్చివేసి క్రీస్తు లాంటి స్వభావము మరియు క్రియలుగా మనలనుమార్చును.***

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక : క్రీస్తు యొక్క శరీరము

---

## ఆరవ పాఠము: ఆరవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: మన చుట్టు అలుముకున్న ఆత్మీయ యుద్ధములో దేవుడు మనకు ఆత్మీయ కవచమును అనుగ్రహించును.**

### <u>మొదటి రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:1- 4 వరకు అధ్యయనము చేయగలరు**

1. వాగ్దానము నుండి వచ్చిన ఆజ్ఞను వ్రాయుము(ద్వితి 6:1-2)?

2. దీనిని మన క్రియలలో(ఆచరణలో) ఏ విధముగా కొనసాగించగలము?

3. తల్లిదండ్రులు ఏ విధముగా పిల్లలను ఇబ్బంది పెడతారు?

4. తల్లిదండ్రులకు ఇవ్వబడిన ప్రాముఖ్యమైన నియమము ఏమిటి?

5. పిల్లలు ప్రభువునందు నీకు విధేయించుటకు నీవు ఏమి బోధించెదవు?

6. ఈ విధమైన తర్ఫీదులో నీ కుటుంబము ఎలా ఎదుగుచున్నది?

### <u>రెండవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:5-9 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనఃపూర్వకముగా సేవించుట యొక్క అర్థము ఏమిటి అని నీవు అనుకొనుచున్నావు?

2. మంచి కార్యములు చేయుటకు ఒక విశ్వాసికి ఏ విధమైన ప్రేరేపణ(నడిపింపు) కావలయును?

3. దేవునికి పక్షపాతము లేదు అను వాక్యమునకు అర్థము ఏమిటి?

4. మనమందరము క్రీస్తులో సమానమైయున్నామని ఇతరులకు నీవు ఎలా చూపిస్తావు?

## <u>మూడవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:10-12 వరకు అధ్యయనము చేయగలరు**

1. 10-11 వచనములలో మనకు నియమించబడిన నియమము ఏమిటి?

2. మనలను ఏ బలము వ్యతిరేకించుచున్నది?మనము ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలి?

3. 11-12 వచనముల ప్రకారము,మనము పోరాడే ఆత్మీయ సైన్యమును గురించి వివరించుము?

## <u>నాలుగవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:13-17 వరకు అధ్యయనము చేయగలరు.**

1. మనము ,విశ్వాసులమై యుండియు మనకు కూడా దేవుడు ఇచ్చు సర్వాంగ కవచము ఎందుకు?

2. దేవుడు ఇచ్చు సర్వాంగ కవచములోని ప్రతిభాగము,శరీరములో ఈ కవచమును ఎక్కడెక్కడ ధరించాలి మరియు ఆ కవచము యొక్క ఉద్దేశ్యముల జాబితాను వ్రాయుము?

3. ఏ ఆజ్ఞ మరల మరల చెప్పబడినది?ఎందుకు ఈ ఆజ్ఞ మరల మరల చెప్పబడినది అని నీవు అనుకొనుచున్నావు?

## <u>అయిదవ రోజు</u>

**ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక 6:18-24 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఎక్కడ ఎప్పుడు ప్రార్థించాలని పౌలు చెప్పాడు?(18 వ వచనమును చూడుడి)

2. తన కొరకు తాను చేసుకున్న పౌలు యొక్క ప్రార్థన విన్నపము ఏమిటి(19)ఆయన యొక్క ప్రాధాన్యతలను చెప్పుము?

3. నీ కొరకు ప్రార్థన చేసే నీ చుట్టూ ఉన్నవారు ఎలా ఉండాలి అని నీవు అనుకొనుచున్నావు?

4. ఈ వాక్యభాగములో నుండి దేవుడు నీకు ఏమి చెప్పుచున్నాడు? నీవు ఎలా స్పందించెదవు?

5. ఆయన నీతో చెప్పిన వాటిని గురించి నీవు ఏమి చేయనైయున్నావో వ్రాయుము?

## ఆరవ రోజు

**పాఠము 6: " దేవుడిచ్చు సర్వాంగకవచమును ధరించుము "**

| | |
|---|---|
| **మూలము:** | **ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక ఆరవ అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఎఫెసీయులకు 6:13 అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువ బడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి.** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **మన చుట్టు అలుముకున్న అత్మీయ యుద్ధములో దేవుడు మనకు అత్మీయ కవచమును అనుగ్రహించును.** |
| **జీవితపు మూలసూత్రము:** | **ప్రార్థన మరియు లేఖనము అనునవి మహా శక్తి గలిగిన ఆయుధములు,అవి మనలను స్థిరమైన విజయములో నిలబెట్టును.** |

### సారాంశము:

6వ అధ్యాయములోని మొదటి 10 వచనాలలో అధికారమును గూర్చి పౌలు మాట్లాడాడు. మన భక్తి జీవితము మనకు శిరస్సైయున్న దేవునికి యిష్టత కలిగించే విధముగా యుండాలి. అందరినీ ప్రేమించమని చెబుతూ,యథార్థమైన హృదయముగలవారై భయముతోను వణకుతోను క్రీస్తునకువలె శరీర విషయమై యజమానులైనవారికి విధేయులై యుండాలని పౌలు సూచించాడు. క్రీస్తు పరిచారకులను ఒక సైనికుడిగా పౌలు

వర్ణించాడు. 5:14-16 లో యిలా వ్రాయబడింది. "నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీమీద ప్రకాశించునని ఆయన చెప్పు చున్నాడు. దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి ". మనము ఇప్పుడు యుద్ధ సమయయములో ఉన్నాము. మనకు కూడాను ఒక శత్రువు ఉన్నాడు.మనకు కలిగిన ప్రార్ధన అనే ఆయుదాన్ని చేతపట్టుకొని ముందుకు సాగుతూ యిదివరకే ఓడిపోయిన మన శత్రువును జయించాలి. ఈ పత్రికలో పౌలు మరికొన్ని ఆయుధములను మనకు పరిచయము చేసాడు-సత్యము, దేవుని నీతి, శాంతి, విశ్వాసము, రక్షణ, మరియు పరిశుద్దాత్మ. దేవుని కవచము, ఆత్మలో ప్రార్ధన- ఇవి రెండు, సాతానుని జయించుటకు మనకున్న బలమైన ఆయుధాలు. అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తము నెరవేర్చినవారై నిలువ బడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి(6:13). సైనికుని ముఖ్యమైన పని పోరాడడమే. కేవలము ఆయన ఇచ్చే శక్తి చేతనే మనము యుద్ధములలో చేరగలము. ఈ యుద్ధములో జయించిన వాని పక్షమున మనము ఉన్నాము. జయాన్ని కలిగించినవాడు దేవుడే!

దేవునిచే పిలువబడిన మనము ఎంత ధన్యులము!! క్రీస్తు శిరస్సు అయియున్న శరీరములో ఒక భాగాలుగా యుండుటకు, ఆయన నివసించుటకు ఒక ఆలయముగ మనలను చేయుటకు, దేవుడు ప్రతీ ఆత్మీయ ఆశీర్వాదములను మనకు అందించాడు. మరుగైయున్నవి ఇప్పుడు తేటగా తెలియపరచబడ్డాయి.చీకటి నుండి వేరుగా యుండుటకు వెలుగు ప్రకాషింపబడింది. యిప్పుడు మన ముందున్న కర్తవ్యం, మరణము వరకు ఆయనలో నమ్మకముగా యుండడమే..!

***ప్రార్ధన మరియు లేఖనము అనునవి మహా శక్తి గలిగిన ఆయుధములు,అవి మనలను స్థిరమైన విజయములో నిలబెట్టును.***

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : పరిపూర్ణమైన మరియు అర్థవంతమైన (మాదిరికరమైన) జీవితము యొక్క రహస్యము

## రచయిత

సంఘాన్ని ఎంతగానో హింసించిన యూదుడైన పౌలును దేవుడు ఎన్నుకొని  అన్యజనులకు సువార్తను ప్రకటించుటకు వాడుకొన్నాడు. క్రైస్తవులను హింసించుటకును, బంధించుటకును,  దమస్కు ప్రాంతానికి బయలువెళ్లిన సౌలు, పునరుత్థానుడైన క్రీస్తు యొక్క దర్శనము ద్వారా పట్టుబడి పౌలుగా మార్పుచెందాడు. తన జీవితగమ్యము మారినది. సంఘాన్ని హింసించిన సౌలు, పౌలుగా మారడము ద్వారా, సువార్త యొక్క శక్తి మరియెక్కువగా  ప్రభలమైయ్యింది. ఈనాడు దేవునిచే మార్పుచెందబడుటకు, మన జీవితాన్ని ఆయన చిత్తములో నడిపించబడుటకు నీవు సిద్ధమేనా?

## సమయము:-

యించుమించు పౌలు ఫిలిప్పు సంఘాన్ని దర్శించిన 11 సంవత్సరముల తరువాత ఆయన రోమాలోని బంధీగృహములో నుండి ఈ పత్రికను వ్రాసాడు. బ్రతుకుట క్రీస్తే చావైన అది ఎంతో మేలు అనేది పౌలు భావన..మరి ఈనాడు మనము వేటిని కోరుచున్నాము?

## ప్రజలు:-

ఫిలిప్పు రోమాలోని మాసిదోనియ ప్రాంతమునకు చెందినదై ఇప్పుడు ఉత్తర గ్రీకుగా పిలువబడుతుంది. ఇందులోని చాలా వరకు ప్రజలు, విగ్రహారాధన నుండి మరలి ఇప్పుడు క్రీస్తును విశ్వసించుచున్నారు. మాసిదోనియలోనుండి ఒక వ్యక్తి తమ ప్రాంతమునకు రావాలని కోరడము, పౌలు తన దర్శనములో చూడడమనే విషయము ఫిలిప్పులో సంఘము స్థాపించుటకు కారణమైయింది. పౌలు, సీలాను,  లూకా, తిమోతి ఇలా అందరును, ఈ ప్రాంతములలో ప్రయాణిస్తూ, సమాజమందిరములలో ప్రజలకు సువార్తను ప్రకటించేవారు. సమాజ మందిరములు వారికి దొరకనప్పుడు, పట్టణపు ద్వారపు ఆవలిలోనికి వెళ్లారు. అక్కడ ప్రార్థించే కొందరి స్త్రీలను ముఖ్యముగా, లూదియా అనే విశ్వాసురాలిని కలసుకొన్నారు.ప్రభువు లూదియా హృదయాన్ని ముందుగానే సిద్ధపరచుట ద్వారా, పౌలు చెప్పిన మాటలను అంగీకరించింది. పౌలు జీవితము మార్పుచెందిన విదముగానే, లూదియా జీవితము కూడా దేవుని మాటలచే మార్పు చెందింది. మార్పు చెందిన తన జీవితము ద్వారా యూరోపియా ఖండమంతటా సువార్త ప్రకటించబడింది. లూదియా వలే దేవుని మటలకై దప్పిక కలిగి యుండాలి.

## ముఖ్య ఉద్దేశ్యము:-

గొఱ్ఱెలకు జీవము కలుగుటకును అది సమృద్ధిగా కలుగుటకును నేను వచ్చితినని యోహాను10:10 లో చెప్పబడిన ప్రకారముగా, ఫిలిప్పి పత్రికలోని మొదటి నాలుగు అధ్యాయాలు, సమృద్ధి కలిగిన జీవితమును గూర్చి మాట్లాడింది. ఫిలిప్పి పత్రిక ఒక సంతోషాన్నిచ్చే పత్రికగా పేర్కొనవచ్చును.ఆనందించుడి అనే పదము ఇంచుమించు 16 సార్లు ఈ పత్రికలో మనము చూడవచ్చు. సంతోషమనేది పరిస్థితుల ద్వారా కలుగదు గాని మన ప్రతికూల పరిస్థితులను సైతము జయిస్తూ ముందుకు సాగుటలో నిజమైన సంతోషము దాగియుంది.

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : పరిపూర్ణమైన మరియు అర్ధవంతమైన (మాదిరికరమైన) జీవితము యొక్క రహస్యము

## మొదటి పాఠము: మొదటి అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము:** **ఒక గొప్ప ప్రణాళిక కొరకు పౌలు శ్రమలు పొందెను.**

### మొదటి రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:1-6 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఫిలిప్పీలో ఉన్న వారి యెడల పౌలు యొక్క అతి ప్రాముఖ్యమైన స్వభావము(వైఖరి) ఏమిటని నీవు అనుకొనుచున్నావు?(1-5 వచనములు)

2. 6 వ వచనములో మనకున్న వాగ్ధానము ఏమిటి?

### రెండవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:7-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. 9 నుండి 11 వచనములలో పౌలు ప్రార్ధించినవిషయముల జాబితాను వ్రాయుము.

   ఎ.

   బి.

   సి.

   డి.

2. నీ కొరకు గాని మరియు ఇతరుల కొరకు గాని ఎప్పుడయినా నీవు ఈవిధముగా ప్రార్ధించితివా?

3. నీవు ఎవరి కొరకు ప్రార్ధించమని దేవుడు నిన్ను అడుగుచున్నాడు?

## మూడవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:9-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. ప్రేమ తెలివిలోను(పొంగిపొర్లే) మరియు జ్ఞానములోను అంతకంతకు అభివృద్ధి పొందుటకు నీవు ఏమి చేయాలి?

2. నిర్దోషమైన మరియు నిష్కపటమైన జీవితము కొరకు నీవు ఏమి చేయాలి?

## నాలుగవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:12-18 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు యొక్క చెర(బంధకముల) వలన ఏ విధమైన ప్రయోజనములు కలిగినవి?

2. నీకు కలిగే ఏ శ్రమను నీవు చెరగా(బందకముగా) భావిస్తున్నావు?

3. నీకు గాని లేక వేరే వారికి గాని నీ యొక్క బందకములు లేదా కష్ట తరమైన శ్రమల వలన ఏమైనా ప్రయోజనములు కలిగినాయా? అయితే అవి ఏమిటి?

## అయిదవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:18-30 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు జీవించడానికి గల కారణములు ఏమిటి?

2. పౌలు మరణించడానికి గల కారణములు ఏమిటి?

3. పౌలు యొక్క విడుదల కొరకు ఎదురుచూచుచున్న కాలములో వారి యొక్క 3 నుండి 4 గుణలక్షణములు వ్రాయుము?

4. ఈ దినములలో ఈ సమాంతర స్వభావములు నీ జీవితమును వేరుగా(నూతనముగా) మార్చుచున్నదా?

## ఆరవ రోజు

**పాఠము 1: " శ్రమలో ఆనందము "**

| | |
|---|---|
| **మూలము:** | **ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఫిలిప్పీయులకు 1:21** "నామట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము." |
| **పాఠ్యాంశ వాక్యము:** | **ఒక గొప్ప ప్రణాళిక కొరకు పౌలు శ్రమలు పొందెను.** |
| **జీవితపు మూలసూత్రము:** | **జీవితములో ఎదురయ్యే సామాన్యమైన శ్రమలలో మనము ఆనందించుట నేర్చుకుందాము.** |

### సారాంశము:

ఫిలిప్పీయులు సువార్తను పౌలు తో కలిసి వ్యాప్తి చేయుటను బట్టి పౌలు వారికి కృతజ్ఞత తెలుపుతూ సంతోషముగా ఈ పత్రిక మొదలు పెట్టాడు. ఆయన తన ప్రియమైన స్నేహితుల కొరకు ప్రార్థన చేసాడు (9-10 వచనములు), మనకు తెలిసిన వారికొరకు మనము కూడా ఇలాంటి ప్రార్ధన చేయాలి. పౌలు చెరసాల నుండి, రోమాలో సంకెళ్ళతో బందింపబడి యున్నప్పటికిని, శ్రమలలో ఉన్నప్పుడు ఎలా సంతోషముగా ఉండాలి అనే విషయములను ఈ పత్రిక ద్వారా వ్రాస్తున్నాడు. సువార్త ప్రతి బంధకముగా ఉండక యేసును గూర్చిన శుభవార్త వ్యాపించుచూనే యున్నది! పౌలు తన విశ్వాసమును బట్టి మాత్రమే ఆయన చెరసాలలో ఉన్నాడని మనందరికి తెలుసు మరియు పౌలు యొక్క విశ్వాసము తోటి విశ్వాసులకు ఎంతో ధైర్యమునిచ్చునదిగా యున్నది మరియు యేసును గూర్చిన విషయములలో ఇతరులకు అసూయ పడే విధముగా యున్నది. ఇంకా, రెండు సంవత్సరములు విభిన్న తరగతుల ప్రజల మధ్యలో, సైనికుల మధ్యలో సంకళ్ళతో బందింపబడియున్నాడు. ఈ గొప్ప శ్రమలో దేవునికి ఒక గొప్ప ప్రణాళిక యున్నది అని పౌలు గమనించాడు. మనము విశ్వాసులముగా, మనము క్రీస్తునందు నమ్మిక యుంచే ఆధిక్యతను దేవుడు మనకు ఇచ్చాడు. అంతేకాదు శ్రమనొందుటకు కూడా అదే అధిక్యత ఇవ్వబడినది.(1 పేతురు 2:21). పరలోక పౌరులముగా, మనము ఒక్క ఆత్మతో కలిసి మరియు ఒక్క ప్రణాళికతో పని చేస్తూ ఒకరి మీద మరొకరు ఆధార పడుతూ మరియు ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలి.

***జీవితములో ఎదురయ్యే సామాన్యమైన శ్రమలలో మనము ఆనందించుట నేర్చుకుందాము.***

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : పరిపూర్ణమైన మరియు అర్థవంతమైన (మాదిరికరమైన) జీవితము యొక్క రహస్యము

### రెండవ పాఠము: రెండవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: నిజమైన సేవకునిగా ఉండుటకు యేసు మనకు మాదిరి అయి యున్నాడు.**

## మొదటి రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక మొదటి అధ్యాయమును మరల పునర్విచారణ చేయగలరు**

1. పౌలు గొలుసులతో బందింపబడుట మరియు చెరలో ఉండుటలో పౌలు యొక్క స్వభావము నుండి నీవు ఎలా ప్రోత్సహించబడుతున్నావు?
2. పౌలు చెరలో ఉన్నప్పుడు ఏ భాగము ఆయనకు చాలా ఇబ్బందిని కలిగించినది అని నీవు అనుకొనుచున్నావు?
3. నీకు ఏది చాలా ఇబ్బందిగా ఉన్నది లేదా ఉండబోవుచున్నది?

## రెండవ రోజు

**లిప్పీయులకు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయమును వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు యొక్క సంతోషము సంపూర్ణము కావాలంటే ఏమి చేయాలని ఆయన చెప్పెను?
2. 3 మరియు 4 వచనములలో ప్రజల మధ్యలో మునపటి ఐక్యతను కలిగియుండే 4 స్వభావములు వ్రాయుము?
3. మన స్వభావము మార్చుకోవాలంటే ఏ విధముగా మార్చుకోవచ్చునని పౌలు చెప్పెను?
4. ఈ క్రింది వచనముల ప్రకారము క్రీస్తుకు కలిగిన స్వభావముల యొక్క జాబితాను వ్రాయుము?

    ఎ. మత్తయి 11:29

బి. మత్తయి 12:18-20

సి. మత్తయి 8:20

డి. యోహాను 5:19,30

ఇ. యోహాను 3:17,8:11

ఎఫ్. మత్తయి 9:36, మార్కు 6:34

## మూడవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 2:5-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఈ వాక్య భాగములో వీలైనన్ని క్రీస్తును గురించిన విశేష గుణలక్షణములను వ్రాయుము?

2. యేసుని ముందు ప్రతి మనుష్యుడు చివరికి ఘనపరిచే (ఎటువంటి) స్థితి ఎందుకు వస్తుంది?

## నాలుగవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:1-6 వరకు అధ్యయనము చేయగలరు**

1. 12 నుండి 16 వచనములలో చెప్పబడిన "మీ సొంత రక్షణ కొనసాగించుకొనుడి"అను దానిని కొన సాగించుటకు వివిధమైన మార్గములను వ్రాయుము?

2. ఈ చీకటి లోకములో విశ్వాసులు ఏ విధముగా ప్రకాషించుదురు?

## అయిదవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:1-6 వరకు అధ్యయనము చేయగలరు**

1. వెంబడించుటకు పౌలు చెప్పిన  మాదిరి అయిన ముగ్గురి పేర్లను వ్రాయుము, వాళ్ళు ఎవరు మరియు ఎందుకు వారు మంచి మాదిరి అయినవారు?

2. నీవు వెంబడించుటకు మంచి మాదిరి అయిన వారు ఎవరయినా ఉన్నారా?

3. అటువంటి వారిని నీ జీవితములోనికి తీసుకొని వచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు చెల్లించుము.

## ఆరవ రోజు

**పాఠము 2: " సేవించుటలో ఆనందము"**

| | |
|---|---|
| **మూలము:** | **ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక రెండవ అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఫిలిప్పీయులకు 2:5 " క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి"** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **నిజమైన సేవకునిగా ఉండుటకు యేసు మనకు మాదిరి అయి యున్నాడు.** |
| **జీవితపు మూలసూత్రము:** | **మన ధీనత్వపు క్రియలు ఈ అంధకార లోకములో వెలుగునిచ్చును.** |

## సారాంశము:

ఫిలిప్పీ సంఘములో ప్రేమలో కొదువగా (ప్రేమ లేని) ఉన్నవారు, ఐక్యతగా లేనివారిని గురించి చాలా లోతుగా పౌలు శ్రద్ధ వహించి మాట్లాడుతున్నాడు. సంఘము పోరాటములు,యుద్ధముల చేత నాశనమై పోతుందనియు మరియు ఇది క్రీస్తు మార్గము కాదని బోధించుచు సాక్ష్యము ఇచ్చుచుండెను. 2 వ వచనములో అందరు కలిసి ఒకే మనసుతో మరియు ఒకే ప్రణాళికతో పని చేయవలెనని వారితో వాదించుచుండెను. క్రీస్తు మనము అనుసరించుటకు మరియు ప్రేమగల సంబంధములకు మనకు మంచి మాదిరి అని పౌలు సూచించెను. ఆయన తన అధికారమును చేయుటకు ప్రయత్నించలేదు కాని తనను తాను ఉపేక్షించుకొని మరియు సమస్తమును దేవుని హస్తములలో పెట్టెను. 12 వ వచనములో, పౌలు "భయముతోను వణకుతోను మీ సొంతరక్షణను కొనసాగించుకొనుడి."అని చెప్పెను. ఇది మనము దేవునితో సత్సంబంధమును కొనసాగించుటకు దోహదపడుతుంది. 13 వ వచనము ప్రకారము "మీరు ఇచ్ఛయించుట కును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును, తన దయాసంకల్పము నెరవేరుటకై మీలో కార్యసిద్ధి కలుగజేయువాడు దేవుడే "ఇలాంటి యేసుక్రీస్తు లాంటి స్వభావమును మనము కలిగి యుంటే మనము ఈ చీకటి లోకములో నక్షత్రముల వలె ప్రకాషిస్తాము.

***మన ధీనత్వపు క్రియలు ఈ అంధకార లోకములో వెలుగునిచ్చును***

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : పరిపూర్ణమైన మరియు అర్ధవంతమైన (మాదిరికరమైన) జీవితము యొక్క రహస్యము

## మూడవ పాఠము: మూడవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: క్రీస్తును ఎరిగియుండుటతో పోల్చితే, జీవితములో మిగిలినవి అన్నియును వ్యర్థమైనవే.**

### మొదటి రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3:1-4 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు ఆనందించుడి అని మరల జ్ఞాపకము చేయుచున్నాడు ఎందుకంటే మన జీవితములో కలిగియున్న స్థితిని బట్టి కాదు కాని ఒక వ్యక్తిని బట్టి అన్నాడు.ఆ వ్యక్తి ఎవరు?

2. పౌలు తన మార్పునకు ముందు దేనిని ఆస్పదము చేసుకున్నాడని చెప్పాడు?(4 వ వచనము)

### రెండవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3:5-11 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు క్రీస్తులోనికి మారుట కొరకు గర్వపడిన ప్రాముఖ్యమైన సంగతుల జాబితా వ్రాయుము?

2. క్రీస్తును ఎరుగుటతో పోల్చితే లోకముతో ఎలా ఉండాలని పౌలు చెప్పుచున్నాడు?(8 వ వచనము)

3. జీవితములో ప్రాముఖ్యమైన ప్రయోజనము ఏమిటని పౌలు అలోచించెను?

### మూడవ రోజు

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3:7-11 మరియు ఎఫెసీయులకు 3:14-15 వరకు అధ్యయనము చేయగలరు**

1. నీ కొరకు మరియు ఇతరుల కొరకు కొద్ది సమయము తీసుకొని ఈ విధముగా ప్రార్ధన చేయుము(ఎఫెసీ 3:14-19).

2. క్రీస్తును ఎరుగుట ద్వారా మనలో కనబడే(కలిగే మూడు అనుభవములు) 3 విషయములు ఏమిటి?

## <u>నాలుగవ రోజు</u>

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 3:12-16 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు యొక్క జీవితపు చివరిలో పాతవి (గతించినవి) లెక్కించక(విడిచిపెట్టి) లేదా ముందున్న వాటికొరకు వేగిరపడుచు గమ్యము ము వైపు పరుగెత్తాడు అనే భాగములో పదముల జాబితాను వ్రాయుము?(12 నుండి 15 వచనములు)

2. మూడు లేదా అంతకంటే ఎక్కువగా పౌలు ఎన్నుకున్న విషయములను వ్రాయుము?

3. పౌలు యొక్క గమ్యము ఏమిటి?

## <u>అయిదవ రోజు</u>

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 1:1-6 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు కొంతమందిని హెచ్చరించిన విషయములో వారి యొక్క గుణలక్షణములు ఏమిటి?

2. పౌలు నన్ను పోలి నడుచుకొనుడి అని చెప్పుటకు గల మూడు కారణములను వ్రాయుము? (20-21 వచనములు)

## <u>ఆరవ రోజు</u>

పాఠము 3: " క్రీస్తును ఎరుగుటలో ఆనందము"

| | |
|---|---|
| **మూలము:** | ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక మూడవ అధ్యాయము |
| **మూలవాక్యము:** | ఫిలిప్పీయులకు 3:10 " ఏ విధముచేతనైనను మృతులలోనుండి నాకు పునరుత్థానము కలుగవలెనని, ఆయన మరణవిషయములో సమానానుభవము గలవాడనై, ఆయనను ఆయన పునరుత్థానబలమును ఎరుగు నిమిత్తమును," |
| **పాఠ్యాంశ వాక్యము:** | క్రీస్తును ఎరిగియుండుటతో పోల్చితే, జీవితములో మిగిలినవి అన్నియును వ్యర్థమైనవే. |
| **జీవితపు మూలసూత్రము:** | అనుదినపు కోర్కెల నుండి చంపుట ద్వారా స్వంతమును అణిచివేయుదుము. |

## సారాంశము:

అంతరంగములో ఐక్యత అనునది లేకపోతే కలిగే భయంకరమైన, అపాయకరమైన హెచ్చరికను గురించి పౌలు మాట్లాడిన తరువాత, బాహ్యమైన వాటిని గురించి హెచ్చరించాడు. ఆయన తన వ్యక్తిగత జీవితములో ఎదురైన శ్రమలలో నమ్మికను కోల్పోకుండా ఎలా ఉన్నాడు, కుటుంబ నేపథ్యము, వ్యక్తిగత గుణలక్షణము మరియు జీవితపు గురి ఏ విధముగా ఉండాలి అనునది ఆయన చెప్పాడు. ఆయన యొక్క గురి, గమ్యములు ఇప్పుడు మారిపోయాయి ఎందుకంటే ఆయన ఇప్పుడు మార్పునొందిన వ్యక్తి. ఇప్పుడు ఆయన యొక్క గ మ్యము ఒక్కటే అది క్రీస్తును పరిపూర్ణముగా ఎరుగుట మరియు దేవుడు ఆయనను ఎందుకు సృష్టించి, రక్షించుకున్నాడో ఆ ప్రణాళికను నెరవేర్చుట మాత్రమే. 12-13 వచనములలో కూడా పౌలు ఇది మాత్రమే నా జీవిత లక్ష్యము అని సూటిగా చెప్పాడు, కాబట్టి మనము దానిని గట్టిగా పట్టుకుందాము!

***నీయొక్క శ్రమలు, శోధనలను దేవునికి సమర్పించుకొంటే మరియు వాటిగుండా ఆయనతో కలిసి వెళ్ళుటను ఎన్ను కుంటే మరియు కేవలము ఆయన మహిమ కొరకే అయితే, నీ శ్రమలు ఎన్న టికి వ్యర్థము కావు అనే సంగతి నీవు గుర్తిస్తావు. ఎదిగే అవకాశమును వ్యర్థము చేసుకొనకు!***

# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : పరిపూర్ణమైన మరియు అర్థవంతమైన (మాదిరికరమైన) జీవితము యొక్క రహస్యము

---

### నాలుగవ పాఠము: నాలుగవ అధ్యాయము

**పాఠ్యాంశ వాక్యము: కృతజ్ఞతతో కూడిన ప్రార్థనలు మన హృదయమును మార్చును.**

**<u>మొదటి రోజు</u>**

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4:1-3 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఒకటవ వచనములోని ఆజ్ఞ ఏమిటి?

2. జీవ గ్రంథములో ఎవరి పేర్లు కలుపబడును?

**<u>రెండవ రోజు</u>**

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4:4-7 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఏ ఆజ్ఞతో కలిసి ఆనందించుడి అనే ఆజ్ఞ ఉన్నది?

2. చింతించుటకు మారుగా మనము ఏమి చేయాలి?

3. విన్నపము తెలియ జేయుట వలన ఫలితము ఏమిటి మరియు చింతించుట వలన ఫలితము ఏమిటి?

**<u>మూడవ రోజు</u>**

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4:8-9 వరకు అధ్యయనము చేయగలరు**

1. మనము దేని కొరకు అలోచించాలి(ధ్యానముంచాలి)?

2. 9 వ వచనములో మూల వాక్యపు క్రియ ఏమిటి?(యాకోబు 1:22-25)

**<u>నాలుగవ రోజు</u>**

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4:10-13 వరకు అధ్యయనము చేయగలరు**

1. పౌలు ఎలాంటి శ్రమలు అనుభవించాడు మరియు వాటి ద్వారా పౌలు ఏమి నేర్చుకున్నాడు?

2. పౌలు యొక్క తృప్తికి కారణము ఏమిటి (13 వ వచనము)?ఇది నీకు ప్రోత్సాహకరముగా లేదా నిరాశగా యున్నదా?

## <u>అయిదవ రోజు</u>

**ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక 4:14-23 వరకు అధ్యయనము చేయగలరు**

1. ఫిలిప్పీయులు పంచుకొనిన దానిని బట్టి పౌలు యొక్క ఆశ ఏమిటి?

2. ఫిలిప్పీయులు పంపించిన బహుమానము పరిమళమైన లేదా మనోహరమైన అర్పణగా ఎందుకు ఉన్నది?

3. మనది ఇతరులకు ఇచ్చుట ద్వారా ఏ వాగ్ధానము కలుపబడి (మనకు)ఉన్నది?

4. ఈ అధ్యయనము అంతటిలో నీ క్రియలలో అనుసరించుటకు, అభ్యసించుటకు ఏమైనా ఉన్నదా?

## <u>ఆరవ రోజు</u>

**పాఠము 4: " కృతజ్ఞతతో కూడిన ప్రార్ధనలో ఆనందము"**

| | |
|---|---|
| **మూలము:** | **ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక నాలుగవ అధ్యాయము** |
| **మూలవాక్యము:** | **ఫిలిప్పీయులకు 4:13 "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను."** |
| **పాఠ్యాంశ వాక్యము:** | **కృతజ్ఞతతో కూడిన ప్రార్ధనలు మన హృదయమును మార్చును.** |
| **జీవితపు మూలసూత్రము:** | **స్థుతులు మరియు ఇచ్చుట అనేది అభ్యసించుట ద్వారా తెలియని తృప్తి దొరుకును.** |

## సారాంశము:

ఈ చివరి అధ్యాయములో, పౌలు చింత కలిగిన సమయములో ఎలా మనము సమాధానముగా ఉండగలము అనే దానిని మనకు చెప్పాడు! ఆయన చెప్పిన ప్రార్ధనలో కృతజ్ఞత మరియు సమర్పణ కలిగి యుండాలని చెప్పాడు. మన అందోళనలలో, వేదనలలో మనము ప్రార్ధన చేసేటప్పుడు కృతజ్ఞతతో మరియు భారమంతా దేవుని మీద వేసి ప్రార్ధన చేయాలి. దేవుని యొక్క సమాధానము అనునది మన అలోచనకు అందని అంత (అర్ధము చేసుకోలేనంతా) దూరములో ఉంది, కాని మనము ఆ యొక్క సమాధానమును మన హృదయములలో మరియు మన మనసులలో అనుభవించాలి. పౌలు తన జీవిత(పాఠముల) అనుభవముల ద్వారా కొన్ని విషయములను మనతో పంచుకున్నాడు. మొదటిది తృప్తి. ఆయన యొక్క ఇరవై సంవత్సరాల పరిచర్యలో, ఆయన చాలా చాలా గొప్ప గొప్ప శ్రమలు అనుభవించినా కూడా ఆయన తృప్తి కలిగి యున్నాడు. ఇంకా, ఎక్కడున్నా, ఏమై యున్నా తృప్తిగా యుండుటను కనుగొని, దానిని కలిగి యుండుట నేర్చుకొనియున్నాడు. 13 వ వచనములో మనతో ఒక రహస్యమును పంచుకున్నాడు, "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను." ఆ ఒప్పుకోలును(నమ్మికను) తన అనుదిన జీవితములో అనుభవించాడు. దీనిని బట్టి మనము మనకంటే కూడా దేవుని మీద నమ్మకముంచుట నేర్చుకోవాలి. ఆ విధముగా పౌలు క్రీస్తును వెంబడించుచూ, ఫిలిప్పీయులకు నన్ను, నా మాదిరిని వెంబడించుడి అని చెప్పెను. క్రీస్తును ముందు పెట్టుకొని పౌలు తన జీవితపు పరుగును పరుగెత్తెను, ఆయన మంచి పోరాటమును పోరాడెను, విశ్వాసమును కాపాడుకొనెను. అదే దేవుడు మనలోను ఈ రోజు నివసించుచున్నాడు. క్రీస్తు నీ జీవితములో ఉంటే సంతోషము ఉంటుంది అనియు, నీ మాదిరి, నీ నమ్మిక, మరియు ఆయనే నీ బలము అనియు పౌలు తో పాటు నీవు నమ్ముచున్నావా?

***స్తుతులు మరియు ఇచ్చుట అనేది అభ్యసించుట ద్వారా తెలియని తృప్తి దొరుకును.***